
# మౌనం

ఉడిమెట్ల గోపాలకృష్ణ



వాతావరణపు మౌనాన్ని ఛేదిస్తూ రైల్వే లోకోషెడ్‌లో నాలుగుసార్లు సైరన్ మ్రోగింది రెండేసి సెకెన్ల విరామంతో — అదే సమయానికి కృష్ణ చంద్ర బంగళాలో టెలిఫోన్ మ్రోగింది.

"నేను రామ్‌ప్రసాద్‌ని మాట్లాడుతున్నాను."

"చెప్పండి సార్."

"సైరన్ వినే వుంటారు."

"లేదు నిద్రపోతున్నాను. ఇదిగో

మీరు రింగ్‌చేస్తే ఇలా లేచేను."

"అర్జంటుగా బయల్దేరండి. లోకో షెడ్ నించి రిలీఫ్ ట్రయిన్ ఆర్డరయింది. 631/1 దగ్గరున్న 235 బ్రిడ్జికి ఇటూ అటూ లైన్లు కొట్టుకుపోయాయి వరదలో."

"అలానే సార్. పదినిముషాల్లో షెడ్‌లో వుంటాను. క్లిక్ క్లిక్."

"సత్యా సత్యా!"

"ఏంటండీ నిద్రలేపేస్తారు."

"వేగం లేచి నా కేంప్‌బేగ్ సర్దు. రిలీఫ్ ట్రయిన్ ఆర్డరయింది."

"అదేంటండీ. నిన్నే కదా కలకత్తా నించి వచ్చేరు. మరెవర్నయినా పంపమని చెప్పండి."

"అరె సత్యా. నీ కెలా చెప్పాలి? వాళ్ళకి నామీద ఎంత నమ్మకం లేకపోతే తక్కిన ఇద్దర్నీ వదిలేసి నన్నే వెళ్ళమంటారు. ఓ రెండు జతల బట్టలూ టవల్సూ అవీ సర్దు. అన్నట్లు రెండు బాటిల్సు లెమన్ స్క్వేషూ పెనామా సిగరెట్ పాకెట్లూ డజనూ మర్చిపోయావంటే నువ్వు తేవాల్సివస్తుంది...." అని ఈలవేసుకుంటూ బాత్రూమ్‌కి పరిగెత్తేడు వుషారు తెచ్చుకుంటూ రైల్వే అసిస్టెంటు ఇంజనీరు కృష్ణచంద్ర.

డ్రస్ చేసుకున్నాడు.

పర్సులో అవసరానికి మించి నోట్లు కుక్కుకున్నాడు- బీరువాలోంచి తీసి ఎందుకయినా మంచిదని అక్కడ పచ్చి మంచినీళ్ళు కూడా కొనుక్కుందికి దొరకవని తెల్సికూడా.

స్కూటరు మరో పదినిముషాల్లో లోకోషెడ్‌లో వుంది. షిఫ్ట్ చార్జిమేన్‌తో కృష్ణచంద్ర "ఇంజన్ రెడీయేనా?"

"మీదే ఆలస్యం. డ్రయివరూ ఇంజనూ కంపార్ట్‌మెంటులూ అన్నీ రెడీ"

'అమ్మదొంగా! మీ లోకోబుద్ధి పోనిచ్చుకున్నావుకాదు. అవతల ట్రాఫిక్ వాళ్ళు ఇంజన్ తీసికెళ్ళడానికి జాప్యం చేస్తున్నంతసేపూ ఇంకా తీసికెళ్ళరేం అనేసి తీరా అన్నీ అయి బండి బయల్దేరుతున్నవేళకి ఇంజన్ రిపేరు అంటూ 'దుకాణం' పెట్టేస్తారు అనుకున్నాడు మనసులో కృష్ణచంద్ర.

రూమ్ మెట్లుదిగి అప్రాన్ మీదికి నడిచేడు. తన పతాలం ఇంకా మూగలేదు.

* * *

"మావా సైరను మోగతంది సెద్దుల."

అదమరిచి నిద్రపోతున్న దేవుడు వులిక్కిపడిలేచేడు. మూడురోజులై వూరికి పట్టిన ముసురు తనకు పట్టిన ఊలనొప్పి పటాపంచలైనట్టనిపించింది.

గోలేంలో నీళ్ళు ముఖానికంటించేడు.

"నాలుగు కుంచాల బియ్యం దుప్పటీ పంచె సంచిలెట్టు" ఎంకికి పురమాయించేడు.

"ఏది ఎర్రంచు పంచెట్టమంటావేటి మా అయ్యిచ్చింది."

"ఏదో ఒకటెట్టే. నేను సంతర్పన బోజనానికి గాని ఎల్తన్ననేటి."

"మల్లెప్పుడొత్తావు"

"అదేటి కొత్తనాగ మాటాడతన్నావు. నాలుగు రోజులైంది వారసం సూత్తన్నవా? రిలీపు ట్రయినంతే మాటలేటి–ఈ యదవ వొర్సానికి పట్టాలుగాని కొట్టుకు పోనాయేటో. ఎదన్న బండి తిరగబడి పోనాదో మరి. నాలుగు సైరన్లు కొడతన్నాడు. నాయాల. సేతినిండా పనే సైను గాని పోయుంతె. అ ద ం తా తిరిగి ఎయ్యాల– అప్పుడు మనం రావాల...."

"అయితే మావ నీకిప్పుడు డబ్బో!"

"అవునెహె. నాకా యాదస్తి నేదు. ఏటి సేద్దామే?"

"పక్కింటి రాజులమ్మ నడిగేదేటి?"

"ఇప్పుడుగాని దాన్ని నెగ్గొడితె రాజులమ్మ మొగోడు కస్సుమంతాడేటో"

"వుండీపిడతల పదిరూపాయిల్దాక సిల్లరుంతాది. పగలగొట్టేత్తాను."

"నీయ్యిట్టం."

పిడిత పగలకొడుతూ ఎంకి "అయితే మావా ఇప్పుడు సైనుమీదికి ఎల్తన్నవు కదా ఎగస్ట్రా డబ్బులొస్తే నాకేటి కొంతా వేటి?"

"ఒల్లకోయె. అవతల సైరను బొంయ్యిమంతుంటె నీకు పరాసికాలు."

* * *

కృష్ణచంద్ర అప్రాన్ మీద నిలబడి డ్రయివరు ఇంజను టెస్ట్ చేసుకోవడం గమనిస్తున్నాడు.

"రిలీఫ్ ట్రయిన్" ఎక్కడ బళ్ళు పడి పోయినా, లైన్లు పాడయిపోయినా వెంటనే లోకో షెడ్డులో "ఎట్ వన్స్" అని ట్రయిను అర్డరు చేస్తారు. క్రేనూ, లైన్లు, సిండరూ, రాళ్ళవేగన్లూ మెడికల్ వేనూ, హైడ్రాలిక్ లిఫ్టర్లూ.... రిలీఫ్ ట్రయన్ బయల్దేరుతుంది. దేవుడులాంటి గ్యాంగుకూలీలు, కేశవరావులాంటి ఇన్స్పెక్టర్లూ, మేస్త్రీలూ, కృష్ణచంద్రలాంటి అఫీసర్లూ ఒహరేమిటి ఆ 'టీమ్'లో వున్న అంతమందీ త్వరత్వరగా లోకో షెడ్ చేరుకుంటారు. కవీసపు బత్యం రెండు వారాలకు సరిపడ్డా.

కృష్ణచంద్ర సిగరెట్ దమ్ములాగుతూ షిఫ్ట్ చార్జిమేన్ రూమ్‌కెళ్ళేడు.

ఫోను రిసీవరు ఎత్తి ఏదో నెంబరు త్రిప్పి "నాలుగు వేగన్ల సిండరూ రాళ్ళూ కావాలి. వేరే బండిలో పంపుతారా? రిలీఫ్ ట్రయిన్ అర్డరయింది ఇప్పుడే ఇస్తారా?"

"సిండరూ రాళ్ళూ అన్నీ రెడీగా వున్నాయి సార్. అయితే వేగన్లు లేవు సైడింగులో. ఏరియా కంట్రోలర్ నించి వేగన్లు తీసుకున్నా లోడింగ్ చేసేందుకు లేబర్ లేదు."

"లోకో షెడ్ నించి నేను పంపితే... వన్ మినిట్" అని షిఫ్ట్ సూపర్‌వైజర్ వేపు తిరిగి "వో పదిమందిని ఇప్పించగలరా. సిండరు వేగన్లలో లోడ్ చెయ్యించాలి."

"అది వాళ్ళపనికాదు. వాళ్ళు చెయ్యరు. బలవంతం చెయ్యడం బాగుండదు."

"ఇంత ఎమెర్జన్సీలో వాళ్ళ పని కాదని ఎలా అనుకోగలరు."

"తప్పదు సార్. ఇంతవరకూ పనిచేసి అలసిపోయేరు. అయినా రిలీఫ్‌ట్రయిను గ్యాంగివాళ్ళు వస్తారుగా."

"మీరు వాళ్ళచేత చేయించలేరు అనండి సరిపోతుంది."

"పోన్లెండి. మీ రెలా అనుకున్నా సరే. అదీగాక మా డిపార్ట్‌మెంటు ఆఫీసరు చెబితే ఏమోగానీ నేను చెబితే ఈ పరిస్థితుల్లో చెయ్యరు."

"హలో....పోన్లెండి. రేపు వుదయం పంపండి."

కృష్ణచంద్ర మరో నంబరు త్రిప్పేడు.

అవతల్నించి 'టెలికామ్ ఇన్స్‌పెక్టర్ భాస్కర్రావ్.'

"నేను కృష్ణచంద్రని."

"చెప్పండి సార్."

"రిలీఫ్‌ట్రయిన్ అర్డరయింది. 235 బ్రిడ్జిదగ్గర ఇటూ అటూ చెరో రెండు కిలోమీటర్లేసి లైను కొట్టుకుపోయింది వరదలో."

"ఈజిట్! నా సాయం ఏం కావాలి టెలీకమ్యూనికేషన్స్ విషయంలో."

"తెల్లారి మీ డిపార్టుమెంటువాళ్ళు మిమ్మల్ని వేధిస్తారుగానీ ప్రస్తుతానికి నాకో సాయం కావాలి."

"చెప్పండి."

ఇక్కడ షెడ్డులో పదిహేను పోర్టబుల్ ఫీల్డు టెలిఫోన్లున్నాయి.వాటిలో ఏది మంచిదో తెల్సా."

"ఏదేంటిసార్ అలా అడుగుతారు. మొన్నే అన్నీ టెస్ట్‌చేసి సీలు వేయించి వాటిమీద తారీఖులు రాయించేను."

"నే నడిగినదానికది జవాబు కాదు. అక్కడ టెలిగ్రాపు స్తంభంనించి నేను తీగలకి తగిలించినప్పుడు పలక్కపోతే మీ మీద సీరియస్ ఎలిగేషన్లు వస్తాయి, అది ఆలోచించారా."


"మరేం భయంలేదు సార్. వున్నవన్నీ మంచివే. ఏదో నంబరు పట్టుకెళ్ళండి అది నా లక్కీ నంబరు."

"అది మీ బాడ్‌లక్ - నంబరు కాకూడదనే నాక్కూడా వుంది ఎదురుగా వున్న చార్జిమేన్‌తో ఎవరైనా నా గురించి రింగ్‌చేస్తే కిందికి కబురుపెట్టండి. రిలీఫ్ ట్రయిన్ దగ్గరుంటాను" కృష్ణచంద్ర మెడికల్ కార్‌నీ, హైడ్రాలిక్ లిఫ్టర్సునీ చూసుకునేవాళ్ళు వేగం వచ్చేసినందుకు లోలోన సంబరపడ్డాడు. ముఖ్యమైన వాళ్ళు వాళ్ళు. ఇంతలో ఇన్స్పెక్టరు కేశవ రావు రానేవచ్చేడు.

"కేశవరావుగారూ. మనవాళ్ళు సగం మందైనా వచ్చేరా?"

"మూడొంతులు వచ్చేసారు సార్."

"షిఫ్టురూమ్‌కెళ్ళి చెప్పండి. మెడికల్ కార్‌నీ, క్రేనూ మొత్తం రిలీఫ్‌ట్రయిన్ వెస్టెండ్‌నించి తెచ్చి ఇంజనుకు తగిలించమని. క్రేనుకి నీళ్ళు పట్టించారా?"




"తెలీదుసార్. నే నిప్పుడే వస్తున్నాను. ఒరే రాములూ క్రేను డ్రయివరు అప్పల్సామిని పిలూ."

"అప్పల్సామి వచ్చేడు సార్. నీళ్ళూ బొగ్గూ అన్నీ వున్నాయ్ సార్."

"ఓకే."

రైల్వేలో 'హలోహిలో'లె ఎక్కువ. డివిజన్‌వాళ్ళు జనరల్ మేనేజరు అంతస్తుల వాళ్ళకి టెలెక్సులు ఫోన్లు దంచడం- వాళ్ళు మళ్ళీ వీళ్ళకి దంచి దంచేయడం....

ఎలా అయితేనేం-

రిలీఫ్ ట్రెయిన్ షెడ్ వదిలింది.

ఇన్స్పెక్షన్ కేరేజ్‌లో కృష్ణచంద్ర నిద్రపోలేదు. సైటు చేరుకోగానే జరగాల్సిన పనుల్ని కలగాపులగంగా ఆలోచిస్తున్నాడు. అది గురుతరమైన బాధ్యతే కాదు. ఫలిస్తే గర్వకారణమైన అనుభూతి కూడాను.

* * *

చీకటిని దూసుకుంటూ రిలీఫ్ ట్రెయిన్ పరిగెడుతోంది. పరిగెట్టి పరిగెట్టి పట్టాలు మరి లేవని తెల్సి ఆగిపోతుంది.

దేవుడు ఆలోచిస్తున్నాడు. 'పరిమినెంటు' అయిన అయిదు సంవత్సరాలకూ ట్రాన్స్ఫర్ల మీద అయిదు డివిజన్లకు తిప్పేరు తనని. తను ఎక్కడ కాలు పెడితే అక్కడ పని అయిపోవడమో మరేదో కారణం- ఈ ట్రాన్స్ఫర్ల గొడవల వల్ల ప్రావిడెంటు ఫండు లెఖ్ఖలు గుమాస్తాలు సరిగ్గా చెప్పలేకపోతున్నారు. అక్కడ్నించి రాలేదని వీళ్ళూ, మేం అప్పుడే పంపేశాం అని వాళ్ళూ-ఇంతలో ట్రాన్స్ఫరూ- రెక్కలు ముక్కలు

చేసుకున్నా కడుపునిండని పరిస్థితి ఎంకికి పెళ్ళయిన కొత్తలో కొన్న కోకలే. మరి కొన్లేదు తను. మిగిలిన నాలుగు డబ్బులూ వెనకెయ్యాపే అంటే పనికిరాని సినిమాలకి తగలెడుతుంది ఎంకి. తను మాత్రం ఎంకి సరదాలు ఎలా అపగలడు? ఆ మాత్రం సినిమా సరదా తప్ప ఇంకేం సరదా తీర్చగలడు తను.... "యదవ సినిమాల్లో ఏటుంటాయట్ల? ఈరోయిన్ని పట్టుకొని ఈరోగాడు ఎగరడాలూ అయీ తప్పితే... ఈపాలి ఎంకికి గట్టిగా సెప్పెయ్యాల. గుంటల్ని ఎండలో ఒగ్గేసి సినిమాల కెల్లొద్దని- వాళ్ళకి పనీపాటా నేర్పితే రేపు అల్లకి పెల్లిల్లయ్యేక అందరి శాతా మంచనిపించుకుంటారు...."

పది సంవత్సరాల భవిష్యత్తులోకి పిచ్చిగా ఆలోచిస్తున్నాడు దేవుడు. చేతిలో తంతే దమ్మిడీ లేదు!

* * *

రిలీఫ్ ట్రయిను గమ్యం చేరింది.

తెలతెలవారింది. వరదలో కొట్టుకు పోయిన రైలుపట్టాలు అల్లంత దూరాన వున్నాయి.

"కేశవరావుగారూ! కిలోమీటరు నంబరూ....ఇక్కడ టెలిగ్రాపు స్తంభం నెంబరూ డైరీలో నోట్ చెయ్యండి" కృష్ణచంద్ర.

"రామ్మూర్తీ, టెలిఫోనువైర్లు కనెక్టు చేయించు ఈ స్తంభానికి. టెలిఫోను పని చేస్తోందో లేదో టెస్టుచేసి మళ్ళీ వైర్లు తీసేయ్."

"రాజుగారూ! రైలు కమ్మీలూ, సిండరూ, ఫిష్‌ప్లేట్లూ, రాళ్ళూ సుమారుగా ఎస్టిమేట్ రాయండి. వేటికవి విడివిడిగా కూడా రాయండి.... వుత్తరం పక్క రెండూ, దక్షిణం పక్క రెండూ మొత్తం నాలుగు కిలోమీటర్ల లైన్లు వెయ్యడానికి సరిపడ్డట్టు మెటీరియల్ ఎస్టిమేట్ చెయ్యండి.... క్విక్.... మనం తెచ్చిన వాటిని మినహాయించండి."

సిగెరెట్ వెలిగించేడు కృష్ణచంద్ర.

"అంజినేయులూ. ఆ కన్పిస్తున్న మామిడితోట చూసావూ అక్కడ ఎవరైనా మనషులుంటే మన సంగతి చెప్పు. ఎవరూ లేకపోతే వరసగా ఇరవై టెంటులు వేయించెయ్. నా టెంటు కొంచెం సెపెరేట్‌గా టెలిగ్రాఫ్ స్తంభానికి దగ్గరగా వేయించు."

"చంద్రరావూ. ఏట్లో నీళ్ళు చూస్తే స్నానానిక్కూడా పనికిరావు. తాగడానికి ఎలాగ? మీ గ్యాంగిని వుపయోగించి పది డ్రమ్ముల్లో త్రాగేనీళ్ళు నింపండి. ఎవరూ స్నానాలకోసం అవి వాడొద్దు. నీళ్ళు ఎక్కణ్ణించి తెస్తారో వెతకండి."

* * *

నిముషాల్లో టెంటులు లేచాయి.

దేవుడు చౌకీదారుకి తన సంచీ అప్పజెప్పేడు.

టెంటులో చౌకీదారు గ్యాంగుకూలీలు పనిముగించి వచ్చేసరికల్లా వారు కోరి

నట్టు ఇచ్చిన సామాన్లతో వండి పెట్టడమే కాదు వాళ్ళ సామాన్లు కూడా కాపలా కాయాలి. కొందరికి మాత్రమే కూర వండాలి. చాలామందికి గంజినీళ్ళు వార్చేస్తే వుల్లిముక్కలతోనో పచ్చిమిరపకాయతోనో అవురావురుమని తినేస్తారు. కొంచం డబ్బుండి పరిస్థితులు బాగులేక మంచి వుద్యోగం దొరకని కుటుంబాలులేని బ్రహ్మచారులు 'కూర' చెయ్యమంటారు. వాడి కూరా వీడి కూరా, కొంచం వాడి అన్నం వీడి అన్నం రుచి చూస్తారు గడసరి చౌకీదార్లు. మాటలు కూడా కట్టుకుంటారు మరీ గడసరి చౌకీదార్లు. తను తెచ్చుకున్నది పంచేసిన వాళ్ళూ లేకపోలేదు. అదీ వాళ్ళ బ్రతుకు।

దేవుడు మాత్రం గంజినీళ్ళతో 'ఏదో తిన్నాను' అన్పించుకుంటాడు. ఏ మాత్రం మిగిలినా ఎంకికి చీరో లంగాయో కొందామని సంసార తాపత్రయం. ఎప్పుడూ మిగల్లేదు. ఏమీ కొనలేదు. అది వేరే విషయం॥

* * *

"కృష్ణారావుగారూ. దక్షిణం పక్క మీ గ్యాంగుల్ని తీసికెళ్ళండి. కేశవరావూ మీరు ఉత్తరంపక్క వెళ్ళండి. బ్రిడ్జి మీద లైను రిపేరుకి పెద్దగా లేదు. దిగువ లైనులో క్రేను వుంచండి. ఎగువలైను ముందు సిద్ధంచేసి బళ్ళు తిరగడానికి వీలుగా చేద్దాం. దిగువలైను బాగుచెయ్యడానికి గ్యాంగుల్ని మారుస్తానులెండి...." నలుగురికీ నాలుగు పనులు పురమాయించేడు కృష్ణచంద్ర.

5' 6" గేజు రీడింగులూ, సూపర్ ఎలివేషన్లూ మేట్లూ మేస్త్రీలూ సాధారణంగా చూస్తారు. ఇప్పుడు కృష్ణచంద్ర స్వయంగా గేజు పట్టుకున్నాడు....।

హుషారుగా పని ప్రారంభమయింది।

"ఎల్లకెల్ల కెల్లినాను...."

"గోంగూరకీ...."

"ఎల్లకెల్ల కెల్లినాను"

"గోంగూరకీ...."

"ఎల్లకెల్ల కెల్లినాను"

వరదదెబ్బకి విసిరేయబడ్డ రైలు కమ్మల్ని ఒక దగ్గర చేరుస్తూ పాట అందుకున్నారు గ్యాంగుకూలీలు. 'పనీ పాటా' అన్న నానుడి పుట్టింది ఇలాంటి స్వభావంలోంచే.అది రైల్వే మజ్‌దూర్‌ల నించి వ్యవసాయ కూలీలవరకూ అవలంభించి అలవాటుపడే స్వభావం. పాట అలసట మానుస్తుంది. శక్తి, హుషారు కూడా తెస్తుంది. ఒక్కొక్కప్పుడు వాళ్ళేమైనా బూతుపాటలు పాడినాకూడా అఫీసర్లు విననివిననట్టు వూరుకుంటారు అందుకే.

"అయామ్ కృష్ణచంద్రా. 235 బ్రిడ్జి నించి మాట్లాడుతున్నాను."

"సీనియర్ డి.ఇ.ఎన్. ప్రసాదరావ్ హియర్."

"సార్. చెరో రెండు కిలోమీటర్ల లైను పోయింది. 631/4, 633/3,

634/2- 636/4 డ్రాయింగులు మన డ్రాయింగు సెక్షనులో వున్నాయి. వాటిని బట్టి రైల్సూ, ఫిష్‌ప్లేట్లూ, సిందరూ, రాళ్ళూ, స్లీపర్లూ పంపండి. సాయంత్రానికి చేరాలి. మరో రెండు డీజిల్ జనరేటర్లని పంపండి. నేను ఎగువలైను బాగుచేస్తున్నాను."

"ఓ.కే."

"ఓసారి మా ఇంటికి ఫోనుచేసి ఎలా వున్నారో కనుక్కోండి."

"ఓ కే. ఓ.కే. బెంగట్టుకోకండి" నవ్వు!

'వీడికేం. ఇంటిదగ్గర కూర్చొని ఎన్ని చిలకపలుకులైనా పలుకుతాడు.' సన్నగా బాధపడ్డాడు ప్రసాదరావు మాటలకి కృష్ణచంద్ర.

* * *

ఎనిమిది రోజుల్లో పని చాలామట్టుకు అయిపోయింది. కృష్ణచంద్ర ఏరోజు కారోజు డివిజినల్ ఆఫీసుకి ప్రోగ్రెస్‌ని ఫోను చేస్తున్నాడు. సింగిల్ లైను వర్కింగ్‌కోసం కాషన్ ఆర్డరు కాయితాలు సంతకాలు చేసి ఎగువా దిగువా స్టేషనుమాష్టర్లకు పంపేడు. వివరంగా డివిజనల్ ఆఫీసుకి పంపేడు. వరుసగా వున్న రివర్సు గుళాయిలలైను మామూలప్పుడే 65 కిలోమీటర్ల అభ్యంతర వేగంతో సూపర్‌ఫాస్ట్ ట్రయినులు పోతాయి. ఇప్పుడీ పరిస్థితుల్లో ప్రతి బండీ ఆగి డ్రయివరు సంతకాలు తీసుకొని అయిదుకిలోమీటర్ల వేగంతో "డెడ్‌స్లో"గా పోవాలని కృష్ణచంద్ర ఆదేశాలు జారీచేసాడు.

* * *

ఎండ వేడెక్కింది.

కేశవరావిచ్చిన కాయితాలు అవతలి ఒడ్డు కృష్ణారావు కిద్దామని దేవుడు ఒక్కొక్క కర్రస్లీపరుమీదా జాగర్తగా అడుగులు వేసుకుంటూ ఆలోచిస్తూ బ్రిడ్జి దాటుతున్నాడు. క్రింద నది 'వుదృతం' అలానే వుంది.

'ఎంకి ఈ పాటికి ఏటి సేస్తా వుంటుంది?'

ఎంకికి ఎన్ని ఆశలు! మొన్న తను విన్నాడు ఎంకి వాళ్ళవదినతో చెప్పడం. .

"ఏటో వదినా. ఎంతొచ్చినా మాకు తిండికే సాలడంలేదు"

"మీకేటి! అన్ని వూర్లూ జిల్సాగా సూస్తారు 'రైలువారోళ్ళు!' టిక్కట్టు కొనక్కర్లేదు. పాసులు."

"ఎవరు సెప్పినారు. సేతి కర్సులో? ఎంకటరమణమూర్తి దరిసినం సేసుకొని అయిదేల్లైపోనాది."

"మీకూ మా కంపినీనాగే బోనసిస్తారట కదా?"

"అవునోలాదిన. అలగ్గానీ బోనసిస్తే తిరపతి ఎల్దామని మావన్నాడే. అక్కడ ఫోటోల దిగుతాం. అదేదో కాటేజీనంట అద్దెకి తీసుకుంటాం."

'ఇంకా ఏటన్నాదే మావ!' హాస్యంగా చిన్న తోపు తోసింది ఎంకిని వదిన.

అంతే!

కాలుజారి దేవుడు నీళ్ళలో పడ్డాడు!!

పుబ్బిపోయి అంతవికారమైన శవం మీద పడి ఎంకి హృదయ విదారకంగా ఏడుస్తున్న ఏడ్పు రైలు చప్పుడులో కలవడానికి ప్రయత్నిస్తోంది. ఆమె కన్నీరు మరో వరద!

రైల్వే క్రస్లీపర్లమీద శవాన్ని పడుకోబెట్టి చితికి నిప్పంటించేడు కృష్ణ చంద్ర. అది చూసిన గ్యాంగీవాళ్ళు 'నువ్వు అదృష్టవంతురాలివే. ఇంతలా శవదహనం ఎవరికీ జరగదు'- ఆ మాటలకి మరింత ఏడ్చింది ఎంకి.

మరో పాసింజరు రైలు. త్రీటయిర్ మధ్య బెర్తుమీద పడుకున్న ఆసామీ బ్రిడ్జి.... వ ర ద.... వాతావరణాన్ని 'ఎమ్యూజింగ్'గా చూద్దామని తలత్రిప్పి దేవుడి 'చితిమంటల్ని' అక్కడునోళ్ళు వేసుకున్న 'చలిమంటలు' అనుకొని 'నా కొడుకులు' ఇలా మంటలేసుకొని కూర్చోబట్టే నాలుగురోజుల పని పది రోజులు పట్టింది- ఇదే ప్రయివేటు ఫర్మయితే- అని రైల్వేని తిడుతూ ప్రయాణిస్తున్నాడు. ఒక్కో దృశ్యం ఒక్కొక్కరి మనసులో ప్రతిబింబించే తీరు అది! రకరకాల మనుషుల మిశితం ప్రపంచం. ఎప్పుడు ఎవరు సృష్టిలో అడుగు పెడతారో- ఎవరి శరీరం ఎప్పుడు అగ్నిసంస్కారం పొందుతుందో- ఆత్మ అనంతవాయువుల్లో కల్సిపోతుందో.... బ్రతికున్నన్నాళ్ళు కథలూ... కావేశాలూ .... విసుర్లూ.... ప్రేమలూ.... అభిమానాలూ.. అంతరాలూ.. వేదాంతాలూ..

* * *

కృష్ణచంద్ర బంగళా ఫోను రింగ్ అయింది.

"ప్రసాద్ స్పీకింగ్."

"చెప్పండి సార్ కృష్ణచంద్రని."

"గుడ్ న్యూస్ ఫర్ యూ."

"చెప్పండి."

"నీకు డివిజనల్ ఇంజనీరుగా ప్రమోషన్ వచ్చింది. జి.యం. ఇంత త్వరగా రైళ్ళు తిరుగుతాయనుకోలేదుట. నిన్ను వెంటనే రిలీజ్ చెయ్యమన్నారు ఇక్కడ్నించి."

"చాలా సంతోషకరమైన వార్త చెప్పేరు సార్."

అతని గొంతు ఆనందంతో బొంగురు పోయింది. ఆఫీసర్ల అభినందనలు- పిల్లల స్కూలు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లూ.... రిజర్వేషన్లూ.... వీడ్కోలూ .... విందులూ.... పుఫ్ అదో అందమైన అనుభూతి కృష్ణచంద్రకి.

* * *

"తల్లీ. ఇంత వేగం డబ్బులు ఎలా వస్తాయి. నలుగురినీ నాలుగు పక్కలా పంపేనా, దేవుడు ఎక్కడెక్కడ పని చేసాడో అక్కడ్నించి క్లియరెన్సు సర్టి

ఫికేట్లు రావాలి" అన్నాడు పర్సనల్ బ్రాంచి క్లర్కు ఎంకితో. "అప్పుడే సెటిల్‌మెంటు కాయితాలు పూర్తవు తాయి."

"అడు సచ్చిపోయి ఆర్నెలలయింది బాబూ.... నేనేది తిని బతకాల" అంది ఎంకి.

"............"

"మీకూ అప్పాసెల్లెళ్ళుంటారు బాబూ ... నేను అలాగే అనుకోండి బాబయ్యా."

"............"

"మీకేటి బాబూ. డబ్బునోళ్ళు. నేను పేద్దాన్ని. మా వున్నప్పుడే గంజీ నీళ్ళు మించి దక్కలేదు మాకు. ఆ దేవుడు నన్నిలాగ అన్నేయం సేసి పోయాడు బాబూ."

"............"

"ఏదో సెప్పండి బాబూ?"

"నేనేం చెప్పగలను కాయితాలు రానిదే. జవాబులు రాకపోతే నలుగురినీ నాలుగుపక్కలా పంపేను. వెళ్ళేరు. తెచ్చినవాళ్ళు తెచ్చేరు. తేలేనివాళ్ళ మళ్ళీ వెళతామంటున్నారు. వాళ్ళకి టి.ఎ.లు డి.ఎ.లు.... బిల్లులు రాయడం అబ్బ! నన్ను విసిగెత్తించక వెళ్ళు. కాయితాలు వచ్చీగానే నీకు రిజిష్టరు లెటరు రాస్తాంలే. దొరని వుద్యోగం అడుగు. ఇస్తారు" వుచిత సలహా పారేశాడు క్లర్కు.

* * *

మర్నాడు- రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో కృష్ణచంద్రకు అభినందన సభ. అవార్డు బహుమతి ప్రధానం.

ఆఫీసర్లు మాట్లాడేరు. ప్రముఖుల వుపన్యాసాల అనంతరం కృష్ణచంద్ర కూడా మాట్లాడేడు. తనకా రోజుల్లో తనతోపాటు పనిచేసిన కేశవరావూ.... కృష్ణారావూ.... మొదలైనవాళ్ళని జన్మలో మర్చిపోలేనన్నాడు.

అకస్మాత్తుగా గుండెలు గతుక్కు మన్నాయి- దేవుడు.... దేవుడు జ్ఞాపకం వచ్చేడు. అంతరాంతరాళాల్లో ధ్వని....

దేవుడి ఆత్మశాంతికి 'రెండు నిము షాల మౌనం' అని అందర్నీ నిలబడ మన్నాడు కృష్ణచంద్ర.

'నిశ్శబ్దం- మౌనం'- ఆత్మ- దేవుడికి శాంతి.... అందరూ మౌనం- సెకన్ల ముల్లు ప్రదక్షిణం చేసింది. మౌనాన్ని చీలుస్తూ. "మీకుసిగ్గులేదురా బహుమతులు పుచ్చుకుందుకి. నా మొగుడు వరదల పడి సచ్చినాడురా. అది డబ్బులు రాక నేను సస్తన్నానురా ఆఫీసుల తిరగలేక. అవున్లే.... మీకు పెమోషన్లూ.... మాకు సావులూ.... దేవుడు సచ్చిపోనాడని గాపకం వుందిరా మీకు- నేనూ ఆ రైలుకిందే పడిసస్తాన్రా. మరో రెండు నిముషాలు మౌనం సెయ్యండిరా...." అంది ఎంకి వూగిపోతూ

తెలీనివాళ్ళు ఎంకిని పిచ్చిదాన్లా చూసేరు. తెలిసినోళ్ళ 'పాపం దేవుడు చచ్చిపోయాడు కదూ' అని జ్ఞప్తికి తెచ్చుకున్నారు.

కృష్ణచంద్ర మరి 'మౌనం'గా వూరుకోలేదు!

వూగిపోతున్న ఆమెను పట్టుకున్నాడు!

మోగిపోతున్న ఆమె నోరు నొక్కి సాడు!!